# పోతన భాగవతం - గజేంద్ర మోక్షం-పరిశీలన

- డా.జి. అరుణకుమారి

అష్టాదశ పురాణాలలో పద్మపురాణాన్ని మొదట కృష్ణ ద్వైపాయన వ్యాసుడు రచించాడని తరువాత సర్వ పురాణాల సారాన్ని ఆకర్షించి భాగవతం రచించాడని పద్మ పురాణం తెలుపుతుంది.

"తత్ర పద్మ పురాణంతు, ప్రథమం చప్రణీవాన్
తతో 2 న్యాని పురాణాని కృత్వా షోడశతు క్రమాత్
అష్టాదశం భాగవతం, సార మాకృష్యసర్వతః
కృతవాన్ భగవాన్ వ్యాసకి శుక మధ్యాపయ సత్యయమ్".

పద్మ పురాణాన్ని ముందుగా రచించి తరువాత ఇంకొక పదహారు పురాణాలను రచించి పదిహేడు పురాణాల సారభూతంగా పద్దెనిమిదవదైన భాగవతాన్ని స్వయంగా వ్యాసుడు కూర్చాడని తెలుస్తుంది. వ్యాసుడే శుకునికి భాగవతాన్ని స్వయంగా బోధించాడు. విష్ణుపురాణాన్ని పరిశీలిస్తే పద్దెనిమిది మహపురాణాలను ఈ విధంగా విభజించారు.

| **వైష్ణవీయ పురాణాలు** | **బ్రహ్మమత పురాణాలు** | **శైవమత పురాణాలు** |
|---|---|---|
| వైష్ణవం | బ్రహ్మాండం | మాత్స్యం |
| నారదీయం | బ్రహ్మావైవర్తం | కౌర్మం |
| భాగవతం | మార్కండేయం | లైంగం |
| గారుడం | భవిష్యం | శైవం |
| పాద్మం | వామనం | స్కాంధం |
| వారాహం | బ్రాహ్మం | ఆగ్నేయం |

వైష్ణవీయ పురాణాలు శ్రీమన్నారాయణునుని స్తుతించేవి కాబట్టి సాత్త్వికాలు, మోక్ష ప్రదాలు అనీ, బ్రహ్మమత పురాణాలు సరస్వతీ చతుర్ముఖ కుశానులను వర్ణించేవి కాబట్టి రాజసాత్మకాలు, స్వర్గ ప్రదాలనీ, శైవమత పురాణాలు దుర్గా మహేశ్వర విఘ్నేశ కుమార స్వాములను వర్ణించేవి కాబట్టి తామసాత్మకాలని అభిప్రాయ పడ్డారు.

పురాణాలు, మహపురాణాలు, ఉపపురాణాలు అనే పదాలను వింటూ ఉంటాం. అష్టాదశ పురాణాలను ఉపపురాణాలుగా పేర్కొంటారు. ఉప శబ్దాన్ని విడిచిపెట్టి సులభాపేక్షతో ఉపపురాణాలను పురాణాలని వ్యవహరించారని. పురాణాలుగా వ్యవహరింపబడుతున్న ఉపపురాణాలకు అసలు పురాణాలకు మధ్య స్పష్టత కోసం పురాణాలకు ముందు మహశబ్దాన్ని చేర్చారని, ఇలా పురాణాలు మహపురాణాలై ఉపపురాణాలు పురాణాలై నిలిచాయని పండితుల అభిప్రాయం. మూల పురాణాలలోని విషయాలను సంగ్రహించి చెప్పేది ఉపపురాణం.

పురాణం పంచలక్షణం 'సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ వంశాను చరితం చేతి పురాణం పంచలక్షణమ్' అని, మహాపురాణం దశలక్షణం అని అన్నారు. సర్గం,విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాను కథలు, నిరోధం, ముక్తి, అశ్రయం ఈ లక్షణాలు భాగవతంలో కనిపిస్తాయి.

| | | |
|---|---|---|
| సర్గం | – | బ్రహ్మాండ సంభవం అనగా విష్ణువే విశ్వం. |
| విసర్గం | – | చరాచరాత్మకం |
| స్థానం | – | పరమేశ్వరునిచే రక్షింపబడటం |
| పోషణం | – | భక్తుల రక్షణ |
| ఊతులు | – | ఆగ్రహం, అనుగ్రహం, శుభవాసనల |
| మన్వంతరాలు | – | మనువు కాలం |
| ఈశాను కథలు | – | అవతారాలు, భగవంతుని లీలలు |
| నిరోధం | – | ప్రళయం |
| ముక్తి | – | బంధాలనుండి విడుదల, మోక్షం |
| ఆశ్రయం | – | పరమాత్మలో ప్రవేశించటం |

'భాగవతానాం చరితమ్ భాగవతం' అని అన్నారు. ఇది భగవంతుని తత్త్వాన్ని, భాగవతుల, విష్ణుభక్తుల చరిత్రను తెలియ జేస్తుంది. భగవంతుని పురస్కరిమచుకొని రచింపబడిన గ్రంథం. బహుతత్త్వార్థగర్భితమైన మహపురాణం భాగవతం. విష్ణు భాగవతానికి, సాత్యత (విష్ణువు) సంహిత, పరమహంస సంహిత, గీతార్థ నిర్ణయసారం, జీవేశ్వర తత్త్వనిర్ణయ శాస్త్రం, బ్రహ్మ విద్య స్వరూపం, ఉపనిషద్రహస్యం, మోక్ష గ్రంథం, పుణ్యకథలు అని వ్యవహరించారు. కర్మ జ్ఞాన భక్తి మార్గాలలో భక్తిమార్గం శ్రేష్టమైనదిగా సులభమైనదిగా భావించాడు వ్యాసుడు. నారద మహర్షి చేత ప్రబోధితుడైన వేద వ్యాసుడు భక్తియుక్తమైన తన చిత్తంతో పరమేశ్వరుని చూచి నారాయణ భక్తియోగం కన్నా భవ బంధాలను తొలగించే సాధనం మరొకటి లేదని తలంచి లోకహితాన్ని కాంక్షిస్తూ భాగవత పురాణాన్ని వినిపించినట్లు సంప్రదాయం ఉంది. రోమహర్షణుని పుత్రుడైన ఉగ్రశ్రవసుడు మునులకు పురాణాన్ని వినిపించాడు. పురాణాన్ని వినిపించే వాడిని సూతుడన్నారు.

భాగవతం మొదట మనశ్శాంతి కోసం పుట్టింది. విష్ణు నామ కీర్తనాన్ని చెప్పే భాగవతం దుస్వప్నాలు రాకుండా చేస్తుందని వివరిస్తుంది. భాగవతంలో ప్రతిపద్యం నారాయణాత్మక పరబ్రహ్మం. బ్రహ్మప్రాప్తి పరమ ప్రయోజనమని, విష్ణుభక్తి ఎన్నటికీ చెడదని ప్రతీతి.

భాగవతంలో ద్వైతం (జీవాత్మ, పరమాత్మల ప్రత్యేకత), అద్వైతం ( జీవుడు, దేవుడు ఒక్కటే), ఆత్మ ప్రకృతి పరమాత్మ విశిష్టా ద్వైతంలో ప్రధాన అంశాలు. పరమాత్ముని లీలావిలాసాల మూలంగా ఆత్మలు సృష్టింపబడి ప్రకృతిలోని కర్మలను అనుభవించి పరమాత్మునిలో లీనం అవుతాయని, జగద్విశిష్టుడగు జీవుడు దేవునితో ఐక్యం పొందుతాడని విశిష్టా ద్వైతం వివరిస్తుంది.

**అద్వైతం:–** గజేంద్ర మోక్షంలో గజేంద్రుని ప్రార్థనంతా అద్వైతమే. "ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండు లీనమై", "లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వల నెవ్వం డేకాకృతి యై వెలుగు....." విశ్వమయత అనేగుణం విష్ణువందే వున్నది. బ్రహ్మాదులందు లేదు. శ్రీమన్నారాయణడే సర్వోత్తముడు. భగవంతుడు ప్రకృతి ద్వారా సమస్త ప్రపంచాన్ని సృష్టించాడు. అతని సృష్టి మిథ్యకాదు సత్యమని వివరిస్తుంది.

**ద్వైతం:-** అద్వైతాన్నయినా, ద్వైతాన్నయినా, విశిష్టాద్వైతాన్నయినా ఇమడ్చగలదనే విషయం సత్యం. ప్రకృతి పురుషులు భిన్నమని వివరిస్తుంది.

**విశిష్టాద్వైతం:-** భగవంతుని లీలా వినోదంలో భాగంగా అత్మలు సృష్టింపబడి కర్మఫలాన్ననుభవించి పరమాత్మలోలీనం కావటం. భాగవతంలో గజేంద్రుడు దీనికి ఉదాహరణ

గజేంద్రుడు గ+జ+ఇంద్రుడు – గ అంటే నిరంతర గమనం గలదని, జ అంటే నిరంతర జనన శీలం కలదని, ఇంద్ర = ఇంధతే ప్రకాశతే ఇతి అనగా మిలమిలలాడుతు జ్ఞాన దీపికలో ఉండే మనస్సు అని అర్థం.

గజేంద్రుడు అంటే జననమరణ పరిభ్రమణం కలిగి భగవంతుని చేరాలనే జ్ఞానదీప్తితో కూడుకున్న మనస్సు. అదే జీవుడు; ముక్తి సాధకుడు. ఆ సాధకుడు సాత్త్విక గుణంతో భగవంతుని చేరుకోడానికి తనలో గుప్తంగా ఉన్న దేహత్రయంలో కలిసి ఉన్నాడన్నదే క్షీరసముద్రం మధ్య గల త్రికూట పర్వతం పైన గజేంద్రుడున్నాడన్న దానికి అర్థం. త్రికూట పర్వతం – విశ్వ, త్రైజనికీ , జనన మరణం, (ప్రాజ్ఞం – జ్ఞాన దీపం) అనే దేహం త్రయం మూడు శిఖరాలు. స+ము+త్+రం = సముద్రం అనే పదానికి అర్థం ఈ విధంగా అందించారు. ముత్ అంటే ఆనందాన్ని, ర అంటే గ్రహించడంతో, స అంటే కూడినదని ఆనంద రూప పరమాత్మను గ్రహించేటందుకు యత్నం చేసే సత్త్వగుణం సముద్రమని వివరించారు. త్రికూటం అనగా బంగారం, వెండి, ఇనుము అనే మూల ప్రకృతి భౌతిక సృష్టి. పది లక్షల కోట్ల భార్యలు అనగా పది ఇంద్రియాలు. వాటి వలన కలిగిన ఉపవృత్తులతో ఆ జీవుడున్నాడు. ఈ విధంగా దేహక్రియ వృత్తులతో, ఉపవృత్తులతో జీవుడు మాయాశక్తిలో పడి అధోగతి పాలవుతున్నాడు. భగవంతుని చేరాలని జీవుడు అజ్ఞానంలోపడి మాయతో ఆటలాడుతుంటే ఆ జీవుణ్ణి మాయాకల్పితమైన శక్తి అథోగతికి తీసుకొని పోతుంది. జీవుడు పూర్వజన్మపుణ్యఫల వాసనల బలం చేత ప్రాణోత్క్రమణ కాలంలో నిర్గుణ పరమాత్మను ధ్యానించగలుగుతాడు. అజ్ఞానాన్ని హరింపజేసే భగవచ్ఛక్తి సాధకుడికి కలుగుతుంది.

భాగవతంలో మానవ ప్రవృత్తిని ఈ విధంగా ప్రదర్శించారు.

''ఊహకలంగి జీవనపుటోలమునం బడి పోరుచు మహా
మోహలతా నిబద్ధ పదమున్ విడిపించు కొనంగ లేక సం
దేహము పొందు దేహిక్రియన్ దీనదశన్ గజముండె భీషణ
గ్రాహ దురంత దంత పరిఘట్టిత పాద ఖురాగ్ర శల్యమై”.

''అలయక సొలయక వేసట
నొలయక కరి మకరితోడ నుద్ధండత రా
త్రులు సంధ్యలు దివసంబులు
సలిపెన్ పోరొక్క వేయి సంవత్సరముల్”

''వృథుశక్తిన్ గజమా జలగ్రహముతో బెక్కేండ్లు పోరాడి సం
శిథిలం బై తనలావు వైరి బలముం జింతించు మిథ్యామనో

రథమింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరాదంచు స
వ్యథమై యిట్లను బూర్వ పుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితోన్"

పోతన భాగవతము, అష్టమ స్కందము, పద్యం 67,68,69.

తన జీవప్రజ్ఞ కలుషితం కాగా సంసార జంజాటంలో పడి పెనగులాడి తన ముందు గతిని శంకించు (సందేహం కలవాడే దేహి) జీవిలా సంసార వ్యామోహమనే తీగచేత చుట్టబడినవాడై విడిపించుకొనలేక మొసలి (గ్రహించునది గ్రాహము) బారిన పడి కాలిగిట్టల కొన ఎముక శిథలమై దైన్యంతో గజేంద్రుడు ఉన్నాడు. జీవ ప్రజ్ఞను బంధించే వ్యామోహం నుండి బయటపడటానికి విసుగులేక వేయేండ్లు పోరాడి మిథ్యా మనోరథ మింకేటికి అని తలంచి పూర్వ పుణ్యఫల దివ్య జ్ఞాన సంపత్తితో ఆలోచించాడు. ఆలోచన కలగటం కూడా పూర్వ పుణ్యఫలం అని అంటున్నాడు కవి.

ఇంద్రద్యుమ్నుడు అగస్త్యుని రాకను గమనించక పోవటం (ద్యుమ్నం అనగా ప్రకాశవంతమైన, ఇంద్ర అనగా మనస్సుగల జీవుడు). మనస్సును సాధనలచేత పరిశుద్ధి పరచిన సాధకుడు. అతని దగ్గరకు అగస్త్యుడు వచ్చాడు (నగచ్ఛతి ఇతి అగః స్థ – ఉండడం). నిశ్చల పరమాత్మ తత్త్వంలో ఉండటమని దీని అర్థం. సృష్టిలో ఇతర జీవరాసులలో మానవునకు ఉన్నత స్థానం ఉంది. ఇతర జీవరాసులకు లేని జ్ఞానం, తజ్జనితమైన యుక్తాయుక్త విచక్షణమే ఆ ఉన్నతికి హేతువు. విద్యాబుద్ధులు ఆర్జించిన పిమ్మట సంసార హీనత్వాన్ని, భోగాదుల క్షణభంగురత్వాన్ని గుర్తించి, మోక్ష లాభానికి తగిన యత్నాలనాచరించుటే అతని జ్ఞానానికిపరమప్రయోజనం. ఆ మోక్ష సాధన లేకపోతే అతనికి ఆహార భయ నిద్రాదుల విషయంలో సామ్యమున్న జంతువులకు భేదం లేదు. ముముక్షువైన ప్రతి మానవుడు సంసార బంధ విమోచనాన్ని కోరుతాడు. సంసారం బహుళక్లేశం. అందుకే జ్ఞానవంతులు సంసారాన్ని అగాథమైన చీకటి నూతితో, నక్రగ్రాహ పాఠీన సముద్రంతో పోలుస్తుంటారు. సంసారం నుండి తమను తరింపమని కోరుతారు.

గజేంద్ర మోక్షంలో మడుగు – సంసారం, నక్రం– తాపత్రయం, సంసారస్థ బాధ జాలానికి ప్రతినిధులు, గజేంద్రుడు సంసారంలో చిక్కి జ్ఞానవంతుడగుట వలన భగవంతుని ప్రార్థించి ఉద్ధరింపబడిన ఉత్తమజీవి. భవబంధ విముక్తి కోసం భక్తుడు అస్తికుడై, ఆధ్యాత్మీక చింతనా పరుడై ఉండాలి. మనోవాక్కాయ కర్మలతో భగవంతుడికి శరణాగతిపొందటమే ఆత్మ నివేదన భక్తి. దీనినే ప్రపత్తి, న్యాసం, ఆత్మనిక్షేపం అనికూడ అంటారు. జీవాత్మ పరమాత్మల అద్వైత స్థితి కోసం అంతరమైన చైతన్యం అభిలషించే అవ్యక్తమైన ఆధ్యాతిక రతియే భక్తి. ఇది భగవల్లగ్నమైన చిత్త పరిపాకం.

**ముగింపు :**

గజేంద్ర మోక్షణంలో గజేంద్రుడు పూర్వరూపాన్ని పొందాడు కాబట్టి గజేంద్ర మోక్షణం అన్నారు. మోక్షం వేరు మోక్షణం వేరు. వ్యాసుని భాగవతంలో గజేంద్రుడు తొండంతో కమలాన్ని భగవంతునికి అర్పిస్తాడు. ఈ వర్ణన పోతన భాగవతంలో కనిపించదు.

గజేంద్రుడు ఒక సామాన్య జీవికి ప్రతీక. ప్రమత్తుడైన జీవుడు అప్రమత్తుడై భగవంతునికి మొరపెట్టుకోవటంలో జీవుని వేదన ఉంది. ఒక వ్యక్తి భగవంతుడిని చేరుకొనే క్రమంలో కార్మిక ధృక్పథం ఉంది. గజేంద్రమోక్షం భక్తి ప్రధానం అని అంటారు. భక్తి మాత్రమే కాదు వ్యక్తి కూడా ప్రధానమే అని చెబుతుంది. వ్యక్తి పాటించవలసిన ధర్మాలను వివరిస్తుంది. మానవునిలో భౌతికశక్తి, ప్రాణికశక్తి, బౌద్ధికశక్తి, మానసికశక్తి, ఆధ్యాత్మికశక్తులుంటాయి. భౌతికరూపం భౌతికశక్తిగా, కోరికల రూపంలో ప్రాణికశక్తిగా చంచల స్వభావంతో బౌద్ధికశక్తిగా, యుక్తాయుక్త వివేచనతో ప్రేరేపితుడై స్థిరచిత్తం కలిగి మానసికశక్తిగా పలు స్థాయిలలో జీవిలో కొనసాగుతుంది. ఆ సందర్భంలో భగవంతుని గురించిన ఆలోచన కలుగుతుంది.

1. భౌతిక స్థాయిలో గజేంద్ర రూప ధారుడు.
2. ప్రాణక స్థాయిలో అనేక కోరికలతో మడుగులో చిక్కాడు.
3. బౌద్ధిక స్థాయిలో సంసారబంధంలో చిక్కి భగవంతుడు కలడో లేడో అని (సం)దేహక్రియలో ఉంటాడు.
4. మానసిక స్థాయిలో సందేహ నివృత్తి కలిగి నిశ్చల చిత్తం ఏర్పడుతుంది.
5. ఆధ్యాత్మిక స్థాయిలో భగవంతుని అనుగ్రహాన్ని పొందుతాడు.

వ్యక్తి భగవంతుని చేరుకునే క్రమంలో ఈ స్థాయిలు గజేంద్రునిలో కనిపిస్తాయి. గజమకరులకు వేయి సంవత్సరాల పోరాటం సాధ్యమా? ఆ రెండింటి పోరాటానికి అంత కాలం అవసరమా అని ప్రశ్నించుకుంటే అవసరం లేదు అన్న విషయం అందరికీ తెలిసిందే. ఇంతకాలం వ్యక్తి భౌతిక స్థాయిలో అవసరంలేదు. కాని మానసిక స్థాయిలో జరిగే పోరాటానికి పలు సంవత్సరాలు పలు జన్మలు అవసరమే అన్న విషయాన్నే సూచిస్తుంది. మానవుని మనో వృత్తులు అనేకం. మానవునిలో కనిపించే ఈ ఐదు స్థితులు గజేంద్రంలో గమనించవచ్చు. భౌతిక స్థాయిలో ఒక జీవిగా, ప్రాణిక స్థాయిలో అనేక కోరికలతో అలమటిస్తూ మడుగున చిక్కి బౌద్ధిక స్థాయిలో సామాన్య జీవిలా సందేహలోలుడై ఆలోచించి వివేచించి, మానసిక స్థాయిలో పూర్వ ప్రజ్ఞ స్మృతికి రాగా స్థిరచిత్తుడై ఆధ్యాత్మిక స్థాయిలో భగవంతుని అనుగ్రహాన్ని పొందాడు. కామ, తార్కిక, దార్శనిక, పారమార్థిక స్థితులు కనిపిస్తాయి. ఒక జీవి జీవితంలో భగవంతుని అనుగ్రహాన్ని పొందటానికి ఎక్కవలసిన సోపానాలను పరిపూర్ణత వైపుగా వ్యక్తి పయనాన్ని సూచిస్తుంది. భక్తి కన్నా వ్యక్తిలోని పరిపూర్ణత్వ సాధనే ప్రధానమని వివరిస్తుంది పోతన గజేంద్ర మోక్షం.

గజేంద్ర మోక్షం భక్తి ప్రస్థానంతో పాటు వ్యక్తి ప్రస్థానాన్ని తెలియజేస్తుంది. వ్యక్తి జీవితంలోని వివిధ దశలను సూచిస్తుంది.